నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ సోమవారం, 10 ఆగస్టు-2026 balagamtv100@gmail.com పేజీలు-8


## నిరుద్యోగుల గోడు



మిగతా 3లో..

## పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కేసీఆర్..



మిగతా 3లో..

# పోలీస్‌శాఖలో సంస్కరణలు



- త్వరలో 'టీఎంఆర్ఎస్ బ్యూరో,
- టీ-సేఫ్' నూతన సంస్థల ఏర్పాటు
- సైబర్ నేరాలతో రూ.1,750 కోట్ల నష్టం
- వరంగల్ జ్ఞాపకాలు మరిచిపోలేనివి : డీజీపీ సీవీ ఆనంద్
- వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో
- ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష

హైదరాబాద్, ఆగస్టు 09: పోలీస్‌శాఖ ప్రస్తుతం సంస్కరణల దశలో ఉందని, త్వరలోనే ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో (టీఎంఆర్ఎస్)తో పాటు ఫుడ్ అడల్టరేషన్ అండ్ డ్రగ్స్ కంట్రోల్‌ను రెండింటినీ కలిపి టి-సేఫ్ అనే సంస్థను ప్రారంభించనున్నట్టు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఆదివారం హనుమకొండ జిల్లా జాతీయ సాంకేతిక సంస్థ (ఎన్ఐటీ)లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పోలీస్ అమరవీరుల కుటుంబాలతోనూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న బ్యూరోలకు ఇప్పటికే మంజూరైన పోస్టులను బదిలీ చేయనున్నట్టు తెలిపారు. మావోయిజం పూర్తిస్థాయిలో నిర్మూలమైన మిగతా 3లో..

# ఘనంగా లాల్‌దర్వాజా మహాంకాళి బోనాలు

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ
- దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రూ.20 కోట్లతో ఆషాఢ బోనాల నిర్వహణ



హైదరాబాద్, ఆగస్టు 09: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర హైదరాబాద్ పాతబస్తీలో కన్నులపండువగా సాగింది. లాల్ దర్వాజాలోని ప్రసిద్ధ సింహవాహిని మహంకాళి అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో లాల్ దర్వాజా పరిసర ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. జాతర సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రులు, ప్రజాప్రతినిధులకు అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్ బోనాల జాతరకు ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మిగతా 3లో..

## కలుషిత నీళ్లతో బేజారు



- మురుగు, దుర్వాసనతో జలమండలి నీటి సరఫరా
- వర్షాలు కురుస్తున్నా అప్రమత్తం కాని క్షేత్రస్థాయి సిబ్బంది మిగతా 3లో..
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు

# రిజర్వేషన్ల వల్లే ఉన్నత స్థానాల్లో ఉన్నాం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- దళిత విద్యార్థులకు ప్రతిభా అవార్డుల ప్రదానం



హైదరాబాద్, ఆగస్టు 09: చిన్నకోడూరు మండలం మేడిపల్లిలో ఓ రైతు ఆయిల్ పామ్ తోటను పరిశీలన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ లాంటి మహనీయులు కల్పించిన రిజర్వేషన్ల వల్లే మనమంతా చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉన్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నవజీవన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన ప్రతిభ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై.. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దళిత విద్యార్థులకు అవార్డులు అందజేశారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఆ రిజర్వేషన్ల ఫలాలతో గౌరవంగా బతుకుతున్న మనం, తిరిగి సమాజానికి ఏదో ఒకటి చేయాలనే బాధ్యతను పదేండ్ల కింద గుర్తించి సిద్దిపేటలో మాదిగ సామాజిక వర్గం ఉద్యోగులంతా కలిసి 'న్యాస' సొసైటీని స్థాపించడం అభినందనీయమన్నారు. ఉద్యోగులు తమ వేతనం నుంచి ప్రతినెలా వెయ్యి రూపాయలు పక్కనపెట్టి రూ.10 లక్షల నిధిని ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. ఫీజులు కట్టలేని పేద విద్యార్థులకు అండగా నిలబడుతూ, ప్రతీయేడు స్కాలర్‌షిప్ ఇవ్వడం రాష్ట్రానికే ఆదర్శమన్నారు. ఐదేండ్ల కింద ఫీజు కట్టలేని పరిస్థితిలో ఉన్న హౌసింగ్ బోర్డుకు చెందిన రోహిత్ అనే అబ్బాయికి తాను సాయం చేశానని.. ఇప్పుడు ఆ అబ్బాయికి ఏడాదికి రూ.6 లక్షల జీతం వస్తోందన్నారు. తన తొలి ఏడాది సంపాదించిన రూ.6 లక్షలను తిరిగి పేద విద్యార్థుల కోసం ఖర్చు చేయమని నాకే ఇచ్చాడనీ.. ఆ అబ్బాయి ఆలోచనా విధానం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. మిగతా 3లో..

# డోనాల్డ్‌ను దోషిగా నిలబెడతాం


- ఆయన కంపెనీలు, సంస్థలపై దర్యాప్తు చేస్తాం
- వ్యూహరచనలో డెమొక్రాట్లు



వాషింగ్టన్ : త్వరలో జరిగే మధ్యంతర ఎన్నికలలో కాంగ్రెస్‌పై పట్టు సాధించి అధికారంలోకి వచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న డెమొక్రాట్లు దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చుట్టూ ఉన్న కంపెనీలు, ఆర్థిక సంస్థలను లక్ష్యంగా చేసుకొని కూలంకషంగా దర్యాప్తు జరిపేందుకు వ్యూహాన్ని రూపొందిస్తున్నారు. కాంగ్రెస్‌లో మెజారిటీ వచ్చినా ట్రంప్‌ను అభిశంసించేందుకు వెంటనే ప్రయత్నించకూడదని, ముందుగా ఆయనకు వెన్నుదన్నుగా ఉన్న కంపెనీలు, సంస్థలపై విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని వారు భావిస్తు న్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ట్రంప్ రాజకీయ, వ్యాపార వర్గాలతో సంబంధం ఉన్న సంస్థల నుంచి రికార్డులను స్వాధీనం చేసుకోవడానికి ఏం చేయాలనే దానిపై ప్రతినిధులసభలోని సీనియర్ సభ్యులు, కమిటీ సహాయకులు ఇప్పటికే చర్చించారని తెలుస్తోంది. అధ్యక్షభవనంతో నేరుగా తలపడడం కంటే ప్రైవేటు కంపెనీలు, ఆర్థిక సంస్థలపై దర్యాప్తు చేస్తే మరింత ప్రయోజనం మిగతా 3లో..

## లాల్ దర్వాజ మహాంకాళి అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 09: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఓల్డ్ సిటీలో పర్యటించారు. బోనాల పండుగ సందర్భంగా వివిధ ఆలయాలను దర్శించు కుని పూజలు నిర్వహించారు. నాం పల్లిలోని ఏడు గుళ్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. చార్మినార్ అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. లాల్ దర్వాజ సింహ వాహిన మహంకాళి అమ్మ వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు కేటీఆర్‌కు బోనాలు, డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు.



## డ్రగ్ పెడ్లర్ అరెస్టు..



- 2.5 లక్షల హ్యాష్ ఆయిల్ స్వాధీనం
- డ్రగ్ పెడ్లర్ నరేంద్ర శ్రీనివాస్ అరెస్టు

హైదరాబాద్, ఆగస్టు 09: ఈగల్ స్టేట్ టాస్‌ఫోర్స్, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో ఆంధ్రప్రదేశ్ రా ష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన నరేంద్ర శ్రీనివాస్ అనే డ్రగ్ పెడ్లర్‌ను అరెస్టు చేశారు. అతని నుంచి 330 గ్రాముల హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకు న్నారు. దాని విలువ సుమారు రూ.2.5 లక్షలు ఉంటుందని ఈగల్ పోలీసులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ పరిధి గుర్రంగూడలో నివాసం ఉంటున్న నరేంద్ర శ్రీనివాస్ డ్రైవర్‌గా పనిచేస్తు న్నా డు. వ్యసనాలకు బానిసైన అతను, గతం లో డ్రగ్స్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన అనంతరం కొంతకాలం డ్రైవర్‌గా పని చేసిన నరేంద్ర శ్రీనివాస్.. తన ఖర్చులకు ఆదాయం సరిపోకపోవడంతో డ్రగ్స్ విక్రయాల వైపు మళ్లినట్టు ఈగల్ ఫోర్స్ తెలిపింది. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా పదువాకు చెందిన హరి అనే డ్రగ్ సర ఫరాదారుతో స్నాప్‌చాట్ ద్వారా పరిచ యం పెంచుకొని హ్యాష్ ఆయిల్ కొను గోలు చేసి హైదరాబాద్, పరిసర ప్రాం తాల్లో విక్రయించేవాడు. ఈ కేసులో విని యోగదారులపై కూడా దృష్టిపెట్టినట్టు పోలీసులు వెల్లడించారు.

# సాగునీటి కోసం రోడ్డెక్కిన కృష్ణా డెల్టా రైతులు

- రైతు సంఘం ఆధ్వర్యంలో కొత్తూరులో రైతుల రాస్తారోకో
- కృష్ణా డెల్టా ఆయకట్టు భూములకు గోదావరి జలాలు అందించాలి
- కృష్ణా డెల్టాను ఎడారిగా మార్చవద్దు.
- కృష్ణా డెల్టా రైతుల డిమాండ్.. మిగతా 3లో..


## సజ్జనార్ తీరుపై స్వతంత్ర విచారణ చేపట్టాలి



- ట్రైనీ ఐపీఎస్ కేసుపై సీపీ విచారణేంది?
- ఉదయ్ కృష్ణారెడ్డిని ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరించినట్టు ఆరోపణలు ఉన్నాయి
- ఆ కేసును వెంటనే సీబీసీఐడీకి అప్పగించాలి
- సీబీఐ మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు లేఖ

హైదరాబాద్, ఆగస్టు 09: జాతీయ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేరుగా జోక్యం చేసుకోవడంపై వెంటనే విచారణ జరిపించాలని, మిగతా 3లో..

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 732 మంది..



హైదరాబాద్, ఆగస్టు 09: సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. పోలీసుల తనిఖీల్లో ఈ రెండు కమిషనరేట్లలో 732 మంది పట్టుబడ్డారు. రోడ్డు భద్రతను పటిష్టం చేయడమే లక్ష్యంగా నగరంలోమద్యం సేవించి వాహనాలను నడుపుతున్న వాహనదారులపై సిటీ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆగస్ట్ 7, 8 తేదీల్లో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 421మంది వాహనదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. పట్టుబడినవారిలో 344 మంది ద్విచక్రవాహన దారులు, 37 మంది ఆటోరిక్షాలు , 40 మంది కార్లు, ఇతర భారీ వాహనాలు నడుపుతున్నవారు ఉన్నారని పోలీసులు తెలిపారు. సైబరాబాద్ పోలీస్ కమి షనరేట్ పరిధిలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీ సులు విస్తృత తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ జీ నరేందర్ తెలి పారు. ఈడ్రైవ్‌లో భాగంగా 311 మందిని అదు పులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. 238 మంది ద్విచక్రవాహన దారులు, 16 ఆటో లు, 56 కార్ల యజమానులు, 1 భారీ వాహనదారులపై కేసులు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కేసీఆర్..





బలగం టీవీ, నల్లబెల్లి:
దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పరామర్శించారు. నల్లబెల్లిలోని పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసానికి వెళ్లిన కేసీఆర్.. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రజా జీవితంలో పెద్ది సుదర్శన్ రెడ్డి చేసిన సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. ఆయన మృతి పార్టీకి, ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు.

# ఘనంగా జాతీయ యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..





బలగం టీవీ, వేములవాడ:
జాతీయ యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వేములవాడ పట్టణంలోని నంది చౌరస్తా వద్ద వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాత నవీన్ మాట్లాడుతూ.. యూత్ కాంగ్రెస్ కేవలం ఒక రాజకీయ విభాగం మాత్రమే కాదని, యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ భవిష్యత్ రాజకీయ నాయకత్వాన్ని తయారు చేసే బలమైన వేదిక అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, ప్రజా హక్కుల పరిరక్షణ కోసం యువత ముందుండాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు ప్రజల హక్కుల కోసం పోరాడటంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, నిరుద్యోగ యువత సమస్యలు, విద్యార్థుల సమస్యలపై యూత్ కాంగ్రెస్ నిరంతరం ప్రజల తరఫున పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర విప్ ఆది శ్రీనన్న యువతను రాజకీయంగా ప్రోత్సహిస్తూ, యువ నాయకత్వానికి పెద్దపీట వేస్తున్న తీరు అభినందనీయమని న్యాత నవీన్ అన్నారు. పార్టీ కార్యక్రమాల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ప్రజా సమస్యలపై పనిచేసే యువ నాయకులను ప్రోత్సహిస్తూ, వారు రాజకీయంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఆది శ్రీనన్న మార్గదర్శకత్వం, ప్రోత్సాహంతో వేములవాడ నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తాం. ప్రతి గ్రామంలోని యువతను కాంగ్రెస్ పార్టీతో అనుసంధానం చేస్తాం. రాబోయే రోజుల్లో యువతే కాంగ్రెస్ పార్టీకి అతిపెద్ద బలం అనే విధంగా యూత్ కాంగ్రెస్‌ను మరింత క్రియాశీలకంగా తీర్చిదిద్దుతామని న్యాత నవీన్ అన్నారు. యువత రాజకీయాల్లోకి రావడం ద్వారానే సమాజంలో సరికొత్త మార్పులు సాధ్యమవుతాయని, ప్రజల కోసం పనిచేసే యువ నాయకులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని అన్నారు. తాను పిలుపునిచ్చిన వెంటనే స్పందించి కార్యక్రమానికి హాజరై విజయవంతం చేసిన వేములవాడ పట్టణ మున్సిపల్ చైర్మన్ పోల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగర వెంకట స్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు సంఘ స్వామి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు తోటల లహరి, ప్రసాద్, పెంట స్వరణ్, జాగారం సర్పంచ్ ప్రసాద్, నరేష్, మల్లేశం తదితరులకు న్యాత నవీన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరి సహకారం, సూచనలు, ఆశీర్వాదాలు అవసరమని, వేములవాడ నియోజకవర్గంలో యువతకు అండగా నిలుస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని న్యాత నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ నాగ మురళి, చంద్రుర్తి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సొంతపూరి బాలు రెడ్డి, కథలాపూర్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, అర్బన్ ఉపాధ్యక్షుడు బొమ్మ తిరుపతి, రూరల్ కోఆర్డినేటర్ రజనీకాంత్, నవీన్, పసుల ప్రణయ్, సందెల శశికుమార్, షేక్ ఇర్ఫాన్, అక్కి సునీల్, బదుగు వంశీ, సంతోష్, ప్రదీప్, శ్రీనివాస్, ఎబినేచర్, ప్రశాంత్ తదితర యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకుడిపై పోలిక్సో కేలిసు నమోదు..

## ఖమ్మం జిల్లాలో దారుణం: 11 ఏళ్ల బాలికపై లైంలిగిక దాలిడికి యత్నం..



బలగం టీవీ, ఖమ్మం:
ఖమ్మం జిల్లా వైరాలో మానవత్వం సిగ్గుపడేలాంటి అఘాయిత్యం వెలుగు చూసింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న 11 ఏళ్ల ఆరో తరగతి బాలికపై తెలంగాణ రక్షణ సేన పార్టీ ఇన్‌చార్జ్ గౌరవరపు డేవిడ్ రాజ్ లైం గిక దాడికి పాల్పడటంతో స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వైరా ప్రాంతానికి చెందిన గౌరవరపు డేవిడ్ రాజ్.. లెక్కలు చెబుతాననే నెపంతో బాధితురాలి ఇం ట్లోకి బలవంతంగా ప్రవేశించాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని, అమాయక బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ దారుణంపై బాధితురాలి తల్లి వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు తక్షణమే రంగంలోకి దిగి, నిందితుడిపై POCSO (Protection of Children from Sexual Offences) చట్టం కింద తీవ్రమైన సెక్షన్ల క్రింద కేసు నమోదు చేశారు. నిందితుడు డేవిడ్ రాజ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. చిన్నారిపై అఘాయి త్యానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# అంబేద్కర్ అభయహస్తం అమలుకై ఉద్యమిద్దాం

- చలో కోదాడ బహిరంగ సభను విజయవంతం చేద్దాం
- సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పల్లెటి లక్ష్మణ్ మాదిగ
- జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబు మాదిగ



సూర్యాపేట,ఆగస్టు 09:
అంబేద్కర్ అభయహస్తం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ...25న కోదాడలో ఏమ్మార్పిస్ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సూర్యాపేట పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జిల్లా అధ్యక్షులు పల్లెటి లక్ష్మణ్ మాదిగ, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబు మాదిగ ఆధ్వర్యంలో బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరి ంచారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పురపాలక సంఘం ప్రాంగణంలో సభ జరుగుతుందని పేర్కొన్నారు. సభకు మాదిగలు, దళితులు, విద్యార్థులు, మేధా వులు, ప్రజాస్వామికవాదులు తరలిరావాలని పిలుపునిచ్చారు. గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు పోరాడారని, వర్గీకరణ సాధించినప్పటికీ దళితుల సంక్షేమానికి సంబంధించిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని నిర్వా హకులు పేర్కొన్నారు. ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేసి దళిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని, భూమిలేని ఎస్సీ కుటుంబాలకు భూమి, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, విదేశీ విద్యకు ఆర్థిక సహాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయడంతో పాటు దళితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే దళితుల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. బహిరంగ సభను విజయవంతం చేసేందుకు గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలుతరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలోజాతీయ ఉపాధ్యక్షులుకనుకు జానయ్య మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి విజయభాస్కర్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శులు మిద్దె వెంకటయ్య, సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వంగాల వెంకన్న మాదిగ, కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి బచ్చలకూరి నాగరాజు మాదిగ, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి పాల్వాయి సూరయ్య మాదిగ, జిల్లా నాయకులు మొండికత్తి లింగయ్య మాదిగ, కందుకూరు నాగేశ్వరరావు మాదిగ, ఉప్పల వినోద్ మాదిగ, నారకట్ల ప్రసాద్ మాదిగ, పంది ఏసు మాదిగ పాల్గొన్నారు.

# కొడుకుపై గొడ్డలితో దాడి.. తండ్రి అరెస్ట్



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :
తనను తరచూ వేధిస్తూ, కొడుతూ అప్పుల విషయంలో గొడవపడుతున్న కొడుకును హత్య చేసేందుకు ప్రయత్నించిన తండ్రిని కోనరావుపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రవీందర్ తెలిపారు. కోనరావుపేట పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రవీందర్ మాట్లాడుతూ కోనరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కపేట గ్రామానికి చెందిన గుడిపేట రాఘవులు అలియాస్ రాఘవరెడ్డికి కుమారుడు, కుమార్తె ఉన్నారని,కుమారుడు గుడిపేట రాజేందర్ ఎలాంటి పని చేయకుండా తండ్రిని వేధించడంతో పాటు తరచూ కొడుతూ, అప్పులు చెల్లించకుండా గొడవలు చేసేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఆగస్టు 8న మధ్యాహ్నం ఫ్యాన్ విషయంలో తండ్రి, కొడుకుల మధ్య గొడవ జరగగా.. రాజేందర్ తండ్రిపై దాడి చేసినట్లు పేర్కొన్నారు. దీంతో తీవ్రంగా విసిగిపోయిన రాఘవరెడ్డి,కొడుకు బతికి ఉంటే భవిష్యత్తులో తనకు ఇబ్బందులు తప్పవని భావించి,అదే రోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య నిద్రిస్తున్న రాజేందర్‌పై గొడ్డలితో దాడి చేసితల, ముఖంపై నరికాడు. తీవ్రంగా గాయపడిన రాజేందర్‌ను చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారని అన్నారు .ఘటనపై కేసు నమోదు చేసి,నిందితుడు రాఘవులు అలియాస్ రాఘవరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించమని తెలిపారు . కేసు దర్యాప్తును త్వరగా పూర్తి చేసిన ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి, పోలీస్‌స్టేషన్ సిబ్బందిని సీఐ అభినందించారు.

# బీసీ మహిళల ఐక్యతతోనే అభివృద్ధి



- వేములవాడలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా వార్డు కమిటీల ఎన్నిక

బలగం టీవీ వేములవాడ:
పట్టణంలోని వివిధ వార్డుల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం బీసీ మహిళా వార్డు కమిటీలను ఆదివారం ఎన్నుకున్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం వేములవాడ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు చందగిరి అఖిల ఆధ్వర్యంలో ఈ న్నికలు నిర్వహి ంచారు. కార్యక్ర మానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాములు ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా ఎన్నికైన వార్డు కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మ్యాకల పర్శరాములు మాట్లాడుతూ బీసీ మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎదగడానికి ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. బీసీ మహిళల హక్కులు, సంక్షేమం, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి వార్డులో బీసీ మహిళలను సంఘటితం చేసి వారి సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ గడ్డం నరేష్, జిల్లా అధికార ప్రతినిధి కోరుట్ల రమేష్, జిల్లా నాయకులు మారావేణి మహేష్, బాధ పోచవ్వ, కోరేపు మమత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే దంపతులకు ఘన స్వాగతం



- శంషాబాద్ విమానాశ్రయంలో శాలువాతో సత్కరించిన యువజన కాంగ్రెస్ నేత వినయ్‌కుమార్

బలగం టీవీ , ఇల్లంతకుంట:
మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, అంకిత్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఎండీ డాక్టర్ కవ్వంపల్లి అనురాధ దంపతులు విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ వారికి ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ది వాలియంట్ కళింగ ఆంగ్ల గ్రంథం నేడు ఆవిష్కరణ

రజని వాయిస్ : హైదరాబాద్
ప్రఖ్యాత నాటక రచయిత డి విజయ భాస్కర్ తెలుగు లో రచించిన ద వాలియంట్ కళింగ డాక్టర్ శ్రీలత ఆంగ్లం అనువాదం గ్రంథం ఆవిష్కరణ సభ రవీంద్ర భారతి లోని సమావేశ మందిరంలో ఈ నెల పదవ తేదీన రస రంజని నిర్వహణలో జరుగుతున్నదని సంస్థ కార్యదర్శి నట రాజ్ పత్రికా విలేకరులకు తెలిపారు. ముఖ్య అతిథిగా ఆంధ్ర ప్రదేశ్ హై కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ యతి రాజులు పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరణ చేస్తారు. రచయిత్రి శ్రీ లత గ్రంథాన్ని డాక్టర్ కె వి రమణ దంపతులకు అంకితం ఇస్తారు. వేదిక పై ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ సభ్యులు మండలి బుధ ప్రసాద్ తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగునరసింహా రెడ్డి తెలుగు అకాడమీ చైర్మెన్ డాక్టర్ కె వెంకట నారాయణ విద్యావేత్తలు డాక్టర్ హారి బాబు,డాక్టర్ తంగిరాల శ్రీ లత పాల్గొంటారు.

# బిప్లాస్టిక్ నివారణకు ప్రజలందరూ సహకరించాలి

## ఇల్లంతకుంట సర్పంచ్ యం. రాజు



బలగం టీవీ , ఇల్లంతకుంట:
సుప్రీంకోర్టు తీర్పు 2026 నిబంధనల ప్రకారం ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఆగస్టు 15వ తేదీ నుంచి ఇల్లంతకుంట గ్రామంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించేందుకు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ వీ.రాజు తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే అనర్థాలను అరికట్టి, పరిశుభ్రమైన వాతావరణాన్ని గ్రామ ప్రజలకు అందించడమే లక్ష్యంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీ.రాజుమాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, గ్రామ పరిశుభ్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటి పరిసరాలు, డ్రైనేజీలలోచెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను వేస్తే రూ.2,500 జరిమానా, వర్తక, వ్యాపార సముదాయాల ముందు చెత్త వేస్తే రూ.5,000 జరిమానా విధించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఫంక్షన్ హాళ్లు, హోటళ్లలో ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తే రూ.25,000 జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు సైతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నివారించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. గ్రామ ప్రజలందరూ కూడా కూరగాయాలుడ మాంసం కోనుగోలు కోసం వెళ్లినపుడు టిఫిన్ డబ్బాలు వాడలని సూచించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ స్పూన్లు, ఫోర్కులు, స్ట్రాలు, కప్పులు, ప్లేట్లు, థర్మోకోల్ అలంకరణ వస్తువులు, ప్లాస్టిక్ జెండాలు తదితర ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నివారించాలని సూచించారు.

### నాలుగు రకాల డస్ట్‌బిన్ల పంపిణీ

గ్రామంలో చెత్తను తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్త, ప్రత్యేక చెత్తగా వేరు చేసేందుకు ప్రతి కుటుంబానికి నాలుగు రకాల డస్ట్‌బిన్లు అందించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. ప్రతి కుటుంబం చెత్తను వేర్వేరుగా సేకరించి, గ్రామపంచాయతీ చెత్త బండి వచ్చినప్పుడు ఆయా డస్ట్‌బిన్లలోని చెత్తను అందించాలని సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, ప్రతి కుటుంబం విధిగా తమ ఇంటి ముందుకు వచ్చే గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో మాత్రమే వేయాలని కోరారు. ప్రజల సహకారంతో ఇల్లంతకుంటను పరిశుభ్రమైన, ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

# (మొదటిపేజీ తరువాయి)

## ఘనంగా లాల్‌దర్వాజా మహంకాళి బోనాలు

రాష్ట్రంలోని అన్ని దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బోనాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఆలయానికి వచ్చిన వారందరికీ అమ్మవారి దర్శనం సులభంగా అయ్యేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశామని చెప్పారు. నెల రోజులుగా జరుగుతున్న ఈ ఉత్సవాల్లో తెలంగాణ కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన అధికారులకు, పోలీసులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, రైతాంగం సుభిక్షంగా ఉండాలని, తెలంగాణ అన్ని రంగాల్లో ముందుకు సాగాలని అమ్మవారిని వేడుకున్నట్టు చెప్పారు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని దేవాలయాల్లో బోనాల జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. అమ్మవారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

## పోలీస్‌శాఖలో సంస్కరణలు

క్రమంలో గ్రేహౌండ్స్ తదితర విభాగాల్లోని సిబ్బందిని కొత్తగా ఏర్పాటు చేసే విభాగాలకు బదిలీ చేయనున్నట్టు చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లా సమీక్షను ముగించామని, ఇప్పుడు వరంగల్, భూపాలపల్లి, ములుగు జిల్లాలను సమీక్షిస్తున్నట్టు చెప్పారు. పోలీస్ అమరవీరుల కుటుంబాల కోసం టీజీ వీర్ అనే యాప్‌ను ప్రారంభిం చామని అన్నారు. పోలీస్ అమరవీరుల కుటుంబాల్లో ఎలాంటి సమస్యలున్నా యాప్‌లో నమోదు చేస్తే పరిష్కరిస్తామని వివరించారు. గతేడాదిలో ప్రజలు దొంగతనాలతో రూ.250 కోట్లు పోగొట్టుకుంటే, సైబర్ క్రైమ్‌తో రూ.1,750 కోట్లు పోగొట్టుకున్నారని తెలిపారు. అధికంగా వ్యాపార వర్గాలే నష్టపోతున్నాయని అన్నారు. ప్రస్తుతం మాదకద్రవ్యాల సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. 'ఈగల్', సైబర్ నేరాలు, ట్రాఫిక్ సమస్యలు, ఆర్థిక నేరాలను లోతుగా సమీక్షించడానికి జిల్లా పర్యటనలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ విషయాలపై వరంగల్‌లోనూ సమీక్ష నిర్వహించామని, అన్ని విషయా ల్లో వరంగల్ పోలీసు కమిషనరేట్ ముందంజలో ఉందని తెలిపారు.

## రిజర్వేషన్ల వల్లే ఉన్నత స్థానాల్లో ఉన్నాం

శ్రీజ అనే దళిత విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు వస్తే ఫీజు తాను చెల్లించానన్నారు. న్యూస్ సొసైటీకి ఈ యేడు కూడా రూ. లక్ష ఆర్థికసాయం అందజేస్తున్నట్టు తెలిపారు. కేసీఆర్ హయాంలో దళిత విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు, ఎస్సీ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ తెచ్చామనీ, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్షిప్, దళిత బంధు లాంటి అద్భుతమైన కార్యక్రమాలు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో రూ.5,403 కోట్లు కేటాయించి.. 74 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందన్నారు. అవి కూడా జీతాలు, కరెంట్ బిల్లులకే సరిపోయాయన్నారు.దళితబంధు కింద రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి, బడ్జెట్‌లో రూ.2000 కోట్లు పెట్టి.. ఏ ఒక్కరికైనా ఒక్క రూపాయి సహాయం చేశారా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం 2024-25లో 33వేల కోట్లు ఎస్సీ నిధి కింద చూపి కేవలం 14 వేల కోట్లే ఖర్చు చేసిందనీ, అందులో పెన్షన్లు అన్నీ కలిపి ఖర్చుగా చూపిస్తున్నారన్నారు. మాదిగ, మాల, ఏకలవ్య, సేవాలాల్, కొమురం భీమ్, బీసీ కార్పొరేషన్లు అని పేర్లు పెట్టి కాగితాలకే పరిమితం చేశారు తప్పా.. ఆ కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. విద్యార్థులు బాగా చదవాలనీ, చదువుకు పేదరికం, కులం అడ్డుకాదనీ, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని, నాలుగైదేండ్లు క్రమశిక్షణతో కష్టపడితే భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యూస్ అధ్యక్షులు మొలుగు బాలరాజు, ప్రధాన కార్యదర్శి కర్రే స్వామి, ట్రెజరర్ ఏటి నవీన్, సభ్యులు ఎస్ కనకయ్య, పి రాజయ్య, పి మల్లేశం, పి బాలకిషన్, లింగం, గంగాధర్, బెజ్జం శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

## డోనాల్డ్‌ను దోషిగా నిలబెడతాం


చేకూరుతుందని డెమొక్రాట్లు అనుకుంటున్నారు. తాజా పరిణామాలను నిశితంగా గమనిస్తే డెమొక్రాట్లు అత్యంత జాగరూకతతో ఆచితూచి అడుగులు వేస్తున్నారని అర్థమవుతోంది. ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడు అయినప్పుడు తాము నేర్చుకున్న అనేక పాఠాలను కూడా వారు గుర్తు చేసుకుంటున్నారు. కాంగ్రెస్‌లో మెజారిటీ ఉంటే ట్రంప్‌ను అభిశంసించడం తేలికే అవుతుంది. అయితే ట్రంప్ తనను ఓ బాధితుడిగా చిత్రీకరించుకొని ప్రజల సానుభూతిని పొందే అవకాశం కూడా ఉంటుంది. కాబట్టి నవంబరులో మధ్యంతర ఎన్నికలు జరిగిన తర్వాత... ట్రంప్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను నిశితంగా గమనించాలని, అలాగే తన మిత్రులు, సన్నిహితులు, దాతలకు ప్రయోజనాలు చేకూర్చడానికి ఆయన తన అధికారాన్ని ఉపయోగించారా లేదా అనే విషయాన్ని పరిశీలించాలని, అందుకోసం సభా దర్యాప్తు అధికారాలను ఉపయోగించుకోవాలని డెమొక్రాట్లు నిర్ణయించుకున్నారు.

## సజ్జనార్ తీరుపై స్వతంత్ర విచారణ చేపట్టాలి

అత్తాపూర్ పీఎస్‌లో ఉదయ్ కృష్ణారెడ్డిపై నమోదైన కేసును సీబీసీఐడీకి అప్పగించాలని సీబీఐ మాజీ డైరెక్టర్ ఎం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ-మెయిల్ ద్వారా డీజీపీ సీవీ ఆనంద్‌కు 4 పేజీల లేఖను పంపినట్టు ఆదివారం తన 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు. ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా పేరుపొందిన సజ్జనార్.. ఉదయ్ కృష్ణారెడ్డిని కూడా ఎన్‌కౌంటర్ చేస్తానంటూ కస్టోడియల్ విచారణలో బెదిరించినట్టు ఆరోపణలు ఉన్నాయని ఆ లేఖలో ఉన్నాయని పేర్కొన్నారు. ఒక ట్రైనీ ఐపీఎస్ కేసును సీపీ సజ్జనార్ ఎందుకంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారో, నిందితుడిని ఎన్‌కౌంటర్ చేస్తామంటూ ఎందుకు బెదిరించారో తేలాలంటే వెంటనే ఆ కేసును సీఐడీకి బదిలీ చేయాలని డీజీపీని కోరారు. ఈ కేసులోని ఫిర్యాదుదారు 2024 బ్యాచ్‌లో ఇండియన్ పోలీస్ సర్వీస్‌కు ఎంపికై, మణిపూర్ క్యాడర్‌కు కేటాయించబడ్డారు. సర్వీస్ కేటాయింపును మెరుగుపరచుకోవడంలో భాగంగా ఆమె మళ్లీ సివిల్ సర్వీసెస్ పరీక్ష రాసేందుకు తన ప్రాథమిక శిక్షణను వాయిదా వేసుకున్నారు. ఈ కాలంలో ఆమెకు 2025 బ్యాచ్‌లో ఐపీఎస్‌గా ఎంపికైన ఉదయ్ కృష్ణారెడ్డితో సోషల్ మీడియా పరిచయం ఏర్పడి వ్యక్తిగత, ప్రేమ సంబంధంగా మారింది. కానీ, అప్పటికే తమిళనాడు క్యాడర్‌కు చెందిన ఐఏఎస్‌ను వివాహం చేసుకున్న ఆమె మణిపూర్ నుంచి తమిళనాడుకు బదిలీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ అంశం నేటికీ కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. ఉదయ్ కృష్ణారెడ్డి క్యాడర్ కేటాయింపు ఇంకా పెండింగ్‌లో ఉన్నది. ఆయనను ఏ రాష్ట్ర క్యాడర్‌కు కేటాయిస్తారన్న దానిపై స్పష్టత లేదు. ఉదయ్ కృష్ణారెడ్డితో బాధితురాలికున్న సంబంధం ఆమె భర్త దృష్టికి రావడంతో ఆ సంబంధాన్ని పరస్పర అంగీకారం లేనిదిగా చిత్రీకరించినట్టు తెలుస్తున్నది. లైంగిక వేధింపులకు గురయ్యానంటూ బాధితురాలు తొలుత ఎన్‌పీఏ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీని పర్యవసానంగా పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిని నిందితుడిగా చేర్చి, అరెస్టు చేశారు

## యూత్ కాంగ్రెస్ 66వ ఆవిర్భావ దినోత్సవం

### మద్దిరాల యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు కుజ ఎల్లేష్



**హైదరాబాద్, ఆగస్టు 09:** యువజన కాంగ్రెస్ 66వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం మద్దిరాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కుజ ఎల్లేష్ చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ చేసి యువజన కాంగ్రెస్ మిత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుజ ఎల్లేష్ మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ మిత్రులు అందరూ క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ మరియు ఎంఎల్సీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు పని చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క యువజన కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్క గడప గడపకు తీసుకెళ్లాలని, ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని సూచించారు. త్వరలో నూతన కమిటీలు ఏర్పాటు చేయబడతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లింగమూర్తి, దామోదర్, వంశీ, మహేందర్, సురేష్, సాయి, సుమన్, సిద్దు, గణేష్, రింబు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## నూతనకల్ మండల కేంద్రములో

యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్ గారి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బ్రేడ్ ప్యాకెట్‌లు పంపిణీ చేయడం జరిగింది. ముఖ్య అతిథిలుగా తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి నూతనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి నూతనకల్ మండల మాజీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి విచ్చేసి మాట్లాడుతూ దేశ రాజకీయాలలో యువతే కీలకం అని కాంగ్రెస్ పార్టీ గుర్తించి, యువకులను గుర్తించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు దరిపెల్లి వీరన్న, నకిరకంటి వెంకన్న, ఇమ్మరెడ్డి మహేష్ రెడ్డి,బండపల్లి సాగర్, చురకంటి చంద్రారెడ్డి, ఇరుగు కిరణ్, మద్దెల సురేందర్ గౌడ్ గ్రామ శాఖ అధ్యక్షులు బొడ్డుపల్లి అంజయ్య, బంటు క్రాంతి కుమార్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొల్క సైదులు యాదవ్ యువజన కాంగ్రెస్ నాయకులు కొరివి గంగయ్య యాదవ్, మూడ్ మోహన్ నాయక్,బొల్లేద్దు నాగయ్య, గుగులోతు రమేష్,బొల్లేపల్లి సాయిగౌడ్,మట్టినరేష్,ఇటికాలమహేష్‌గౌడ్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు...

# సాగునీటి కోసం రోడ్డెక్కిన కృష్ణా డెల్టా రైతులు

- రైతు సంఘం ఆధ్వర్యంలో కొత్తూరులో రైతుల రాస్తారోకో
- కృష్ణా డెల్టా ఆయకట్టు భూములకు గోదావరి జలాలు అందించాలి
- కృష్ణా డెల్టాను ఎడారిగా మార్చవద్దు.
- కృష్ణా డెల్టా రైతుల డిమాండ్..



**పెదపాడు ఆగస్టు 9 :** సాగునీటి కోసం కృష్ణా డెల్టా రైతాంగం రోడ్డెక్కారు.. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పెదపాడు మండలం కొత్తూరులో పెదపాడు, దెందులూరు,ఏలూరు మండలాల కృష్ణా డెల్టా రైతులు, కౌలు రైతులు పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. సాగునీరు ఇచ్చి పంటలు సాగు చేసుకునే అవకాశం కల్పించాలంటూ నినాదాలు చేశారు. రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు జిల్లా పరిధిలోని కృష్ణా డెల్టా ఆయకట్టు భూములకు గోదావరి జలాలు అందించే అవకాశం ఉన్నా ప్రభుత్వం,అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదని విమర్శించారు. కృష్ణా డెల్టా ఆయకట్టు భూములకు గోదావరి జలాలు అందించాలని డిమాండ్ చేశారు. గోదావరి ప్రధాన కాలువకు అదనపు జలాలు విడుదల చేసి పోణంగి పుంత కాలువ ద్వారా ఏలూరు రూరల్ మండలం కృష్ణా డెల్టాకు 10 వేల ఎకరాలకు, పెదపాడు మండలం ఆయకట్టు భూములకు తూర్పు లాకులు వద్ద మోటార్లు పెట్టి తోడి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దెందులూరు మండలం సీతంపేట ఛానల్ కు గోదావరి జలాలు మళ్లించాలని కోరారు. పట్టిసీమ,పులిచింతల నుండి కృష్ణా డెల్టాకు సాగునీరు విడుదల చేయాలని కోరారు.కృష్ణా కేఈ కెనాల్, గోదావరి ప్రధాన కాలువలు సాగునీటి పారుదలకు ఇబ్బందులు ఉంటే యుద్ధ ప్రాతిపదికిన పూడిక తీసి గోదావరి జలాలు కృష్ణా నల్లా శివారు భూములకు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో గోదావరి జలాలను కేఈ కెనాల్ ద్వారా కృష్ణాజిల్లాలోని తేలప్రోలు వరకు మళ్లించి కృష్ణా డెల్టాకు సాగునీరు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. చిత్తశుద్ధితో ప్రభుత్వం,అధికారులు వ్యవహరించి ఎల్ నినో తీవ్రత తగ్గుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్న నేపథ్యంలో కృష్ణా డెల్టాలో పంటల సాగుకు అవకాశం కల్పించాలని కోరారు. రైతులు, కౌలు రైతులు ఎకరాకు రూ. 10వేలు నుండి రూ. 15వేలు వరకు పెట్టుబడి పెట్టి వేసిన వరి నారుమళ్లు నాట్లను కాపాడాలన్నారు. కృష్ణా డెల్టాకు సాగునీరు ఇచ్చేవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ ప్రాంతాన్ని ఎడారిగా మార్చి రైతులు,కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు సుదూర ప్రాంతాలకు వలస పోవాల్సిన దుస్థితి కల్పించవద్దని కోరారు. ఈ కార్యక్ర మంలో కృష్ణా డెల్టా రైతులు ఆవాల మోహన రావు, పల్లపోతు రెడ్డియ్య, బండి శ్రీనివాసరావు, తలారి జయరాజు, శల సూరిబాబు, పంది వెంకటేశ్వరరావు, కడిమి సాంబశివ రావు, చెడుగొండి సూర్యనారాయణ, ఆవాల వరప్రసాద్, శనగల సత్యనారాయణ, అలుగులు హనుమంతరావు, మల్లవరపు రాంబాబు, కడిమి రాజు, గోపాల వెంకటేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## కేసీఆర్‌పై వెల్లువెత్తిన అభిమానం..

### పెద్ది ఇంటికి వెళ్తుండగా దారిపొడవునా కేసీఆర్‌కు సంఘీభావం



**హైదరాబాద్, ఆగస్టు 09:** ఉద్యమ సహచరుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అకాల మరణంతో శోకతప్త హృదయులైన వారి భార్యాపిల్లలు, కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు నల్లబెల్లికి బయల్దేరిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అడుగడుగునా జనం సంఘీభావం పలికారు. ఆదివారం మధ్యాహ్నం ఎర్రవల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి వెళ్లిన ఆయనకు దారి పొడవునా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు. కేసీఆర్‌తో కలిసి సుదర్శన్‌రెడ్డికి నివాళులర్పించేందుకు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. దారి మధ్యలో తన కాన్వాయ్‌ను ఆపి అధైర్యపడొద్దు.. అండగా ఉంటానని అభయమిస్తూ.. కార్యకర్తలను అనునయిస్తూ.. అభివాదం చేస్తూ కేసీఆర్ ముందుకు కదిలారు. తిరుగు పయనంలోనూ ఆయనను చూసేందుకు చౌరస్తాల వద్ద పెద్దసంఖ్యలో కార్యకర్తలు గూమిగూడటం కనిపించింది. వరంగల్ జిల్లాలోని జనగామ, హనుమకొండ, వరంగల్, ములుగు జిల్లాల దారులకు ఇరువైపులా ఎక్కడ చూసినా జనసందోహమే కనిపించింది. కేసీఆర్ కాన్వాయికి వందలాది మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలే కాకుండా సాధారణ ప్రజలు రోడ్లకు ఇరువైపులా నిలబడి కారులో కేసీఆర్ కనిపించగానే ఉద్యమస్ఫూర్తిని చాటారు. నల్లబెల్లికి విచ్చేస్తున్న కేసీఆర్‌కు దారిలో కార్యకర్తలు పెద్ద ఎత్తున సంఘీభావం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు కూడా నర్సంపేట దిశగా తరలివచ్చారు. యాదాద్రి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని బాహుపేట స్టేజీ వద్ద ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీత, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 2 వేల మంది బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సంఘీభావం తెలిపారు. కేసీఆర్ తన వాహనాన్ని బాహుపేట స్టేజీ వద్ద సుమారు అరనిమిషం నిలిపి అక్కడే వేచి ఉన్న గొంగిడి సునీత, మహేందర్‌రెడ్డిని పలుకరించారు. గత కొన్నేండ్లుగా ఆర్థిక మార్గదర్శకాల కోసం ఏఐని వాడుతున్నవారి సంఖ్య అంతకంతకూ పెరిగిపోతున్నది. బ్రిటన్‌లో దాదాపు 2.8 కోట్ల మంది గత ఏడాది తమ వ్యక్తిగత ఆర్థిక వ్యవహారాల్లో ఏఐ సాధనాలను సలహాలు అడిగారని లాయిడ్స్ బ్యాంకింగ్ గ్రూప్ చెప్తుండటం గమనార్హం. దీంతో ఏఐ ద్వారా వచ్చిన సలహా అన్నివేళలా పాటించడానికి వీలైంది కాదని నిపుణులు సూచిస్తున్నారు. ఉదాహరణకు పన్నుల భారాన్ని తగ్గించుకోవడానికి నేను ఏం చేయాలి? అని చాట్‌బోట్‌ను ఓ యూజర్ అడిగినప్పుడు.. అది మోనాకోకు వెళ్లాలని సమాధానం ఇచ్చినట్టు చార్టెడ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ అండ్ డెవలప్‌మెంట్‌కు ఏఐ సలహాదారుడిగా ఉన్న డానిలో మెక్‌గెగ్రీ వివరించారు. దీన్నిబట్టి ఏఐ సమాధానాల్లో ఉన్న అనుసరణీయత ఎంత? అన్నది బయటపడుతున్నదని అంటున్నారంతా. నిజానికి సాంకేతికంగా ఈ సమాధానం సరైనదే (అక్కడ పన్నులు తక్కువ) అయినప్పటికీ.. వాస్తవ పరిస్థితులకు మాత్రం విరుద్ధమన్నది ఎక్స్‌పర్ట్స్ మాట. ఇక రిటైల్ మదుపర్లలో 18-34 ఏండ్ల మధ్య ఉన్నవారు (36 శాతం) ఏఐపై ఆధారపడి తమ పెట్టుబడులపై ఎక్కువగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఫిడెలిటి ఇంటర్నేషనల్ అధ్యయనంలో తేలింది. ఆ తర్వాత 35-54 ఏండ్లవారు (29 శాతం) ఉన్నారన్నది. 55 ఏండ్లకుపైబడినవారిలో 5 శాతం మందే ఏఐపై ఆధాపడుతున్నారు. నిపుణుల సలహాలు సులభంగా దొరుకనివారికి ఏఐ ఇచ్చే ఆర్థికపరమైన సమాచారమే కీలకంగా మారుతున్నది. అయితే తొందరపాటు నిర్ణయాలకు భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని నిపుణులు హితవు పలుకుతున్నారు. ఏఐ కేవలం ఓ సాధనమేనని, విచక్షణ కలిగిన అధికారి కాదని అంటున్నారు. కాబట్టి మితిమీరిన ఏఐ వినియోగం వల్ల నష్టాలేనని ఏఐ ఎథిక్స్‌లో పలువురు స్పెషలిస్టులు చెప్తున్నారు. మార్కెట్ పరిస్థితులు, సందర్భాలనుబట్టి సలహాలు ఇవ్వడం ఏఐ ద్వారా సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. సేవింగ్స్ ఖాతాలో నగదు పెట్టుబడులకున్న అవకాశాలు, ఏయే సాధనాల్లో పెట్టుబడులు లాభదాయకం వంటి ప్రశ్నలకు మీ ఆదాయం, పన్నుల స్థితిగతులు, అవసరాలు తెలియకుండా వచ్చే సమాధానాలు.. మీ ఆర్థిక లక్ష్యాల సాధనకు సరితూగవని వివరిస్తున్నారు. ఏఐ చాట్‌బోట్లతో సున్నితమైన ఆర్థిక సమాచారం పంచుకునే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏఐ సాధనాల్లోకి వెళ్లిన సమాచారం.. అక్కడే నిక్షిప్తమయ్యే వీలున్నదని, సాంకేతికంగా సదరు సాధనాలను భవిష్యత్తులో మరింత మెరుగుపర్చడానికి దాన్ని వినియోగించుకోవచ్చని చెప్తున్నారు. ఇది సైబర్ మోసగాళ్లకు చిక్కితే ప్రమాదమని వివరిస్తున్నారు. అందుకే బ్యాంక్ ఖాతా నెంబర్లు, పాస్‌వర్డ్‌లు, ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నెంబర్లు, ఇతరత్రా వ్యక్తిగత వివరాలను ఆన్‌లైన్‌లో పెట్టరాదని సూచిస్తున్నారు. ముఖ్యంగా ఉచిత ఏఐ సాధనాలను వాడేటప్పుడు మరింత జాగ్రత్త.



## నిరుద్యోగుల గోడు

- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియానికి తరలి వచ్చిన యువకులు
- హైడ్రా విభాగంలో ఉద్యోగాల భర్తీకి ఈవెంట్స్

**హైదరాబాద్, ఆగస్టు 09:** తెలగాణలో నిరుద్యోగం ఏ స్థాయిలో ఉందో చూపించే ఘటన సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం వద్ద శనివారం కనిపిం చింది. హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)లో ఉద్యోగాల భర్తీ కోసం ఏర్పాటు చేసి రిక్రూట్ మెంట్‌కు నిరుద్యోగ యువత భారీ సంఖ్యలో తరలిరావడంతో ఒక్కసా రిగా కలకలం రేగింది. సరూర్‌నగర్ స్టేడియంలో ఆగస్టు 8,9 తేదీల్లో ఉదయం 5గంటలకు ఈవెంట్స్ ఉంటాయని హైడ్రా ప్రకటన విడుదల చేసింది. హైడ్రా విభాగంలో 50 డ్రైవర్, 100 డీఆర్ఎఫ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. దీని కోసం అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. 170 సెకన్లలో 800 మీటర్ల రన్నింగ్, 15 సెకన్లలో 100 మీటర్లు, లాంగ్ జంప్ 4 మీటర్లు, 6 మీటర్ల షాట్‌పుట్ ( 7.2కిలోలు) ఈవెంట్లలో క్వాలిఫై అవ్వాలని హైడ్రా అధికారులు ప్రకటించారు. ఆయా పోస్టుల భర్తీ ప్రక్రియ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైంది. ఉద్యోగ సాధనకు భారీ సంఖ్యలో నిరుద్యోగులు తరలివచ్చారు. ఉద్యోగం సాధించా లనే పట్టుదలతో నిరుద్యోగ యువకులు శనివారం తెల్లవారుజాము నుంచే సరూర్‌నగర్ స్టేడియం వద్దకు చేరుకుని క్యూలైన్లలో నిల్చున్నారు. సమయం గడిచేకొద్దీ నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి యువత తాకిడి విపరీతంగా పెరిగింది. చూస్తుండగానే సుమారు 2000 నుంచి 3000 మందికి పైగా యువకులు తరలిరావడంతో స్టేడియం పరిసర ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. దీంతో అధికారులు అభ్యర్థులను నియంత్రించేందుకు టోకెన్లు పంపిణీ చేపట్టారు. ఈ క్రమంలో ఒక్కసారిగా తోపులాట చోటు చేసుకుంది. ముందుకెళ్లేందుకు అభ్యర్థులు ఒకరినొకరు నెట్టుకోవ డంతో గందరగోళం నెలకొంది. దీంతో పోలీసులు వెంటనే స్టేడియానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి యువతను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. నిరుద్యోగుల సంఖ్యను అంచనా వేయడంలో నిర్వాహకుల అంచనాలుతప్పడమేఉద్రిక్తతకు ప్రధానకారణమనిఅభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

## కలుషిత నీళ్లతో బేజారు

- మురుగు, దుర్వాసనతో జలమండలి నీటి సరఫరా
- వర్షాలు కురుస్తున్నా అప్రమత్తం కాని క్షేత్రస్థాయి సిబ్బంది
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 09:** గ్రేటర్ హైదరాబాద్ ప్రజలను కలుషిత తాగునీరు కలవరపెడుతున్నది. గత కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలమండలి వ్యాప్తంగా తాగునీరు సరఫరా అవుతున్నది. పలుచోట్ల నల్లా నీళ్లు మురుగు, దుర్వాసనతో వస్తుండటంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు వ్యాధుల బారిన పడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు కాలనీలు, బస్తీల ప్రజలు డయేరియా బారిన పడుతున్నామని వాపోతున్నారు. జల మండలి వ్యాప్తంగా వర్షాకాలం యాక్షన్ ప్లాన్ ప్రణాళికాబద్ధంగా, పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జలమండలి పైపులైన్లకు లీకేజీలను ఎక్కడికక్కడ వదిలేస్తుండటంతో వరదనీరు, వర్షపునీరు కలుస్తూ మురుగునీళ్లు సరఫరా అవుతున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం, జలమండలి అధికారుల అలక్ష్యంతో లీకేజీలను అరికట్టలేకపోతున్నారు

# సంపాదకీయం

## బొద్దింకల వేటలో రాహుల్ !

బొద్దింకలను బుట్టలో వేసుకోవడమెలా? ఇప్పుడు ఇదే ఆలోచనతో కాంగ్రెస్ అప్రకటిత అగ్రనేత రాహుల్ గాంధీ తన ప్రయత్నంలో తను ఉన్నారని చెప్పాలి. బొద్దింకలకు మద్దతుగా ఆయన కార్యక్రమాలు చేస్తున్నారు. నిజానికి ఈ బొద్దింకల వెనక కాంగ్రెస్ పార్టీ కూడా ఉందన్న టాక్ ఒకటి రాజధానిలో చక్కర్లు కొడుతోంది. మోడీని పడగొట్టాలంటే రాహుల్‌తో కావడం లేదు. ఆయన జనం దగ్గర పెద్దగా ప్రతిష్టను సంపాదించలేకపోయారు. యూపిఎ ప్రభుత్వం ఓడినప్పటి నుంచి నానా కష్టాలు పడ్డా లాభం లేకుండా పోతోంది. రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, రిజర్వేషన్లు ఎత్తేస్తారని బాగా ప్రచారం చేయడంతో గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కొంత పుంజుకుంది. అయితే ఇది రాహుల్ నాయకత్వాన్ని పుంజుకునేంతగా మాత్రం కాదు. ఇప్పుడు ఇటీవల దేశంలో ఓ కుదుపు కుదిపిన బొదింకలను బుట్టలో వేసుకునే ప్రయత్నం లో ఉన్నారు. వారి ఆందోళనకు మద్దతుగా పార్లమెంట్‌లో పోరాడుతున్నారు. అలాగే వారితో కలసి పని చేసేందుకు ఉత్సాహ పడుతున్నారు. ఇటీవల ఉద్యమంలో పాల్గొన్న కొందరు విద్యార్థులతో కలసి మీడియా ముందుకు వచ్చారు. ప్రయాగ్ రాజ్‌లో జెన్‌జీలతో కలసి ఆందోళనకు పిలుపునిచ్చారు. ఇవన్నీ కూడా ఓ క్రమపద్ధతిలో మోడీని ఢీకొనేందుకు చేస్తున్న ప్రయత్నాలుగా గుర్తించాలి. తాజాగా రైతులు కూడా మళ్లీ రోడ్డెక్కబోతున్నారు. ఈ ఇద్దరిని కలిపితే వాలిలా తన బలం కూడా పెరుగుతుందని భావిస్తున్నట్లుగా ఉంది. ఇకపోతే ఇటీవల రాహుల్ తన ఆహార్యాన్ని కూడా మార్చారు. జీన్స్, టి షర్ట్‌తోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఖద్దరు బట్టలను ఉత్తికి అవతల పడేశారు. యువతరం మనసులో ఏముందో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీ విధానాలు, నినాదాలను సవరించుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని భావిస్తున్నారు. తమిళనాడు ఎన్నికల ఫలితందీనిని రుజువు చేస్తోంది. ఎన్నికలు రాగానే సరికొత్త సంక్షేమ పథకాలను ప్రకటించి ఓటర్లకు డబ్బు పంచితే చాలన్న భావన ఇప్పటివరకు ఉండేది. తమిళనాడు ఎన్నికలు ఇందుకు భిన్నంగా ఫలితాలను ఇచ్చాయి. టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ డబ్బు పంచకుండాఇ, పెద్దగా ప్రకటనలు చేయకుండా ద్రవిడ పార్టీలను దెబ్బతీసారు. తమిళనాడులో యువతను ఆకట్టుకోవడం ద్వారా విజయ్ అధికారంలోకి వచ్చారు. విజయ్ కూడా ద్రవిడ పార్టీలతో పోటీపడి సంక్షేమ పథకాలు ప్రకటించినా ప్రజలు వాటి గురించి పట్టించుకోలేదు. నిజానికి నేటి తరానికి చెందిన యువత కేవలం సంక్షేమ పథకాలను మాత్రమే కోరుకోవడం లేదు. ప్రభుత్వంలో జవాబుదారీతనం కోరుకుంటున్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా వివిధ స్థాయిల్లో జవాబుదారీతనం ఇప్పుడు లోపించింది. అధికార దుర్వినియోగం పెచ్చరిల్లింది. పాలకులు విలాసాలు పెరిగాయి. ప్రభుత్వాలలో ఏ స్థాయిలో కూడా జవాబుదారీతనం కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ ఒక్క ఫైలు కూడా దానంతట అది కదిలే పరిస్థితి లేదు. లంచం ఇవ్వనిదే కాగితం కదలని పరిస్థితి. ఈ కారణంగానే ఈ దేశ యువతలో ఆశలు, ఆకాంక్షలతో పాటు నిరాశా నిస్పృహలు చోటుచేసు కుంటున్నాయి. అందుకే అవకాశం రాగానే మార్పును ఆహ్వానిస్తున్నారు. పరీక్షా పేపర్ల లీక్ విషయంలో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరించింది. తాము చేసే పనులే మంచివనే పరిస్థితికి మోడీ వచ్చేశారు. అందుకే ఆయన ప్రజల గుండెచప్పుడు వినలేకపోతున్నారు. జెన్‌జీ లంతా బొద్దింకల రూపంలో నిరసనలు తెలపడంతో కొంత సర్దుకున్నా, పూర్తిగా సర్దుకునేందుకు సిద్ధం కావడం లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని రాహుల్ దూకుడు ప్రదర్శిస్తున్నారు. అందుకే దేశంలోని రాజకీయ పార్టీలు బొద్దింకల పేరు ఎత్తగానే భయపడుతున్నాయి. నిన్నటి తరం ఆలోచనలతో, పాత చింతకాయ పచ్చడి విధానాలతో నడుస్తున్న పార్టీలకు ఎన్నికలలో నవతరం నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. యువతరంలో ఆశలు,ఆకాంక్షలు పెరుగుతున్న సమయంలోనే నిరాశా నిస్పృహలు కూడా వారిని కమ్మేస్తున్నాయి. బొద్దింకల ఢిల్లీ ఆందోళన ఇందుకు తాజా ఉదాహరణ. ఈ బొద్దింకలను పట్టేస్తే..మనకు తిరుగు లేదని అందరూ ఆలోచన చేస్తున్నారు. రాహుల్ గాంధీ ఓ అడుగు ముందుకు వేసి వారికి మద్దతుగా పోరాట పంథా అవలంబిస్తున్నారు. పార్లమెంట్ లోపలా, బయటా ఇప్పుడు, విద్యార్థులు, యువత గురించి గట్టిగా మాట్లాడు తున్నారు. యవతరంతో కనెక్ట్ కాని పార్టీలు మెల్లగా తెరమరుగవుతాయని గుర్తించారు. ప్రధాని మోదీ కూడా సామాజిక మాధ్యమాల్లో యువతరం వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తదనుగుణంగా వ్యూహాలు రూపొందించుకోవాలని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ ఘూవత్ కూడా ఇదే విషయాన్ని ప్రకటించారు. స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుండి నడిపించిన కాంగ్రెస్ పార్టీ... ఆ తర్వాత దేశాన్ని సుదీర్ఘ కాలం పరిపాలించింది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధానమంత్రులుగా పనిచేశారు. కాంగ్రెస్ నాయకుల పెడ ధోరణులు కారణంగా నేటి తరానికి దూరం అయ్యారు. పార్టీని ఎప్పటికప్పుడు యువతతో కనెక్ట్ చేసుకునే పనిని కాంగ్రెస్ నాయకులు చేయలేదు. విధానాలను, ఆలోచనలను సవరించుకొని నవీకరించుకోవడంలేదు. డెబ్బై అయిదేళ్లు పైబడిన ప్రధాని నరేంద్ర మోదీ ఈ దేశం యువతతో కనెక్ట్ అవుతుండగా... వయసులో చిన్నవాడైన రాహుల్‌గాంధీ యువతను ఆకట్టుకోలేకపోయారు. ఆలస్యంగా అయినా ఇప్పుడు రాహుల్ యువత గురించి ఆలోచి స్తున్నారు. అయితే బొద్దింకల పార్టీ రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. కేవలం ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని అభిజిత్ దీప్కే ప్రకటించారు. ఈ క్రమంలో రాహుల్ బుట్టలో పడతారా లేక సొంతగా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తారా అన్నది ముమ్ముందు తేలనుంది. ఓ వైపు రాజ్యాంగం బుక్, మరోవైపు బొద్దింకల ఎజెండాతో ముందుకు సాగడం ద్వారా జాతీయ స్థాయిలో విజయం సాధించి అధికారం చేపట్టాలన్న లక్ష్యంతో రాహుల్ సాగుతున్నారు.

# అరుణాచల్‌పై చైనా కుట్రలకు చెక్

### అరుణాచల్ మ్యాప్‌ను విడుదల చేసిన భారత్

న్యూఢిల్లీ, ఆగస్టు 09 :భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌లో పలు ప్రాంతాలను తమవిగా చెప్పుకునే చైనాకు భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. ఆ రాష్ట్రంలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లు, ఒక సరస్సు సహా 27 కీలక ప్రాంతాలతో కూడిన సవివరమైన ప్రామాణిక మ్యాప్‌ను సర్వే ఆఫ్ ఇండియా విడుదల చేసింది. ఇరు దేశాల మధ్య సరిహద్దుకు సంబంధించి పూర్తి క్లారిటీతో ఈ మ్యాప్‌ను విడుదల చేసింది. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపుల తరువాత ఈ మ్యాప్‌ను ఖరారు చేసినట్టు హోంశాఖ తెలిపింది. తాజా మ్యాప్‌తో ప్రజలకు మరింత అవగాహన పెరుగుతుందని సర్వే ఆఫ్ ఇండియా చెప్పింది. మ్యాప్‌లో తాజాగా చేర్చిన 27 ప్రాంతాల్లో సరిహద్దున ఉన్న మూడు ప్రాంతాలకు (సుబన్‌సిరి జిల్లా) వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది. అదే జిల్లాలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లను కూడా మ్యాప్‌లో చూపించారు. ఈ ప్రాంతాలన్నీ మిలిటరీ మ్యాపుల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్నప్పటికీ సర్వే ఆఫ్ ఇండియా మ్యాపులో వీటిని స్పష్టంగా చూపించడమంటే చైనాకు గట్టి కౌంటర్ ఇచ్చినట్టేనని సంబంధిత వర్గాలు తెలిపాయి. మ్యాపులో చూపించిన పలు ప్రాంతాల్లో చైనా, భారత్ దళాల మధ్య ఘర్షణలు జరిగాయి. అరుణాచల్ ప్రదేశ్‌ను దక్షిణ టిబెట్ అని పిలిచే చైనా ఆ రాష్ట్రంలోని 23 ప్రాంతాలకు కొత్త పేర్లను ఖరారు చేస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ చర్యలతో క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పులు ఉండవని చైనాకు భారత్ అప్పట్లోనే గట్టి కౌంటర్



ఇచ్చింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో భాగంగానే ఉంటుందని స్పష్టం చేసింది. చైనా, భారత్‌ల మధ్య సరిహద్దు రేఖ మెక్‌మెహన్ లైన్ టిబెట్, అరుణాచల్ ప్రదేశ్‌ను వేరు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అరుణాచల్ ప్రదేశ్‌లో 27 ప్రదేశాలకు భారత్ కొత్త పేర్లను పెట్టింది. కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెడుతున్న నేపథ్యంలో.. దానికి కౌంటర్‌గా ఇండియా కూడా కొత్త పేర్లను ఖరారు చేసింది. భారతీయ మ్యాప్‌లో సుమారు 27 ప్రదేశాలను గుర్తించి .. వాటికి ఇండియా కొత్త పేర్లను పెట్టింది. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో ఆ ప్రదేశాలను గుర్తించారు. స్థానికులు గుర్తుపట్టే రీతిలో ఆ పేర్లను పెట్టినట్లు ప్రకటనలో తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెట్టడాన్ని భారత్ వ్యతిరేకించిన విషయం తెలిసిందే. వాస్తవాధీన రేఖ వెంట ఉన్న లాంగ్ జూ ప్రాంతం కూడా కొత్తగా పేరు పెట్టిన ప్రదేశంలో ఉన్నది. ఇక్కడే 1959లో ఇండియా, చైనా మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలోకి చైనా దళాలు ఎంటర్ అయ్యాయి. లాంగ్ జూ సమీపంలో ఉన్న మాజా అనే గ్రామాన్ని కూడా కొత్త మ్యాప్‌లో మార్క్ చేశారు. ఇది అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో ఉన్నది. పర్వత ప్రాంతాలైన జో లా, రిజా లా, పుకుర్ లాతో పాటు బిసా గ్రామం కూడా కొత్త లిస్టులో ఉన్నది. హై ఆల్టిట్యూడ్ పాసేజ్‌లో థాగ్ లా ఉన్నది. 1962లో ఇదే ప్రాంతంలో భారత్, చైనా మధ్య ఘర్షణ జరిగింది. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని కూడా అధికారికంగా మ్యాప్‌లో గుర్తించారు. చాంగ్‌లాంగ్ జిల్లాలో ఉన్న జైరాంపూర్‌ను కూడా లిస్టులో పెట్టారు. సాంబో సరోవర్, బారా కుందన్, చోటా కుందన్, దాన్ బారి, ప్రిత్‌నగర్, తెరిత్నగర్, రామ్‌నగర్, జశ్వంత్ ఘర్, సాగర్, పద్మ, జ్యోతినగర్, బైసాకి ప్రాంతాలు కొత్త లిస్టులో ఉన్నాయి. షేర్ ఏ తప్పా స్మారకం, చోటా రూపక్, బారా రూపక్, శివాజీ నగర్, సున్పురా, కమలాంగ్ నగర్, కమలాంగ్ సాంక్చరీ, బుద్ధామందిర్ కూడా జాబితాలో ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశ్‌ని .. జాంగ్‌నాన్ అని చైనా పిలుస్తున్నది.

# ఏపీటీడీసీ ఆధ్వర్యంలో టూర్ ప్యాకేజీ



- విజయవాడ - వాడపల్లి- విజయవాడ ఒక రోజుటూర్
- జండా ఊపి ప్రారంభించిన ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ



విజయవాడ, ఆగస్టు 9 : రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో విజయవాడ- వాడపల్లి - విజయవాడ వాహన బస్సును శనివారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ కేంద్రం వద్ద ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ లాంఛనంగా ప్రారంభించారు. భక్తులకు, పర్యాటకులకు అధునాతన సౌకర్యవంతమైన రవాణా, ఆహార వసతులతో ప్రణాళికాబద్ధమైన తీర్థయాత్ర అనుభవాన్ని అందించటంలో భాగంగా ప్యాకేజీని రూపకల్పన చేసినట్లు ఆయన అన్నారు. ప్రతీ శనివారం ఉదయం 4 గంటలకు ప్రారంభమై రాత్రి 7 గంటలకు తిరిగి విజయవాడ చేరుకుంటామన్నారు. ప్యాకేజీ ధర పెద్దలకు రూ. 1,160/-, పిల్లలకు రూ. 1,000/- గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రుసుములో బస్సు రవాణా ఛార్జీలతో పాటు ఉదయం అల్పాహారం మరియు మధ్యాహ్న భోజన వసతి కలిగి ఉంటాయని అన్నారు. ఆలయ దర్శనం టికెట్ ఛార్జీలను పర్యాటకులే స్వయంగా భరించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ప్రత్యేక యాత్రను సద్వినియోగం చేసుకోవాలనుకునే భక్తులు పర్యాటకులు www.aptdc.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో గానీ, లేదా విజయవాడ బందర్ రోడ్, లెమన్ ట్రీ హోటల్ పక్కన ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ వద్ద నేరుగా సంప్రదించి తమ సీట్లను ముందుగానే బుక్ చేసుకోవాలని జనరల్ మేనేజర్ టి ఎస్ వి నారాయణ తెలిపారు.

# ఎంతోకాలం యుద్ధంతో తీవ్ర నష్టం

- ఇరాన్ యుద్ధం నుంచి బయటపడడమే మేలు
- ట్రంప్ నకు జనరల్ డాన్ కేన్ సలహా ఇచ్చినట్లు ప్రచారం



వాషింగ్టన్,ఆగస్ట్ 9: గత ఐదు నెలలుగా ఇరాన్‌తో సాగిస్తోన్న యుద్ధం కారణంగా అమెరికా ఆయుధ నిల్వలు తరిగిపోతున్నా యని పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తమవుతు న్నాయి. ఈ ఘర్షణలకు త్వరగా ముగింపు పలకాలని స్వదేశంలో డిమాండ్లు వినిపిస్తు న్నాయి. ఈ క్రమంలోనే అగ్రరాజ్య జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్ ట్రంప్ కార్య వర్గానికి కీలక సూచనలు చేసినట్లు తెలుస్తోం ది. ఇరాన్‌తో యుద్ధం నుంచి ఇకనైనా బయట పడాలని.. లేదంటే ప్రతికూల ఫలితాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించి నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఇరాన్‌తో యుద్ధం స్వల్ప కాలికంగా ఉండాల్సింది. ఇప్పటికే అది ఆ దశను దాటేసింది. పశ్చిమాసి యలో ఘర్షణలు తీవ్రతరం చేయడానికి మనకు అందుబాటులో ఉన్న సైనిక చర్యలు ప్రతికూల ఫలితాలు ఇచ్చే ప్రమాదం ఉంది. కేవలం వైమానిక శక్తితోనే నిర్దేశిత లక్ష్యాలను మనం సాధించలేం. అందుకే ఇకనైనా, ఈ యుద్ధం నుంచి బయటకు వచ్చే మార్గాలను అన్వేషించాలని ట్రంప్ సలహాదారులకు డాన్ కేన్ ప్రైవేటుగా చెప్పినట్లు తెలుస్తోంది. ఇదే విషయం గురించి ఆయన పలువురు క్యాబినెట్ అధికారులు, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తోనూ చర్చలు జరిపారట. ఇరాన్‌లో భూతల దాడులకు విముఖత చూపుతోన్న అధ్యక్షుడు ట్రంప్.. దానికి బదులుగా వైమానిక దాడులను మరింతగా పెంచుతామని ఇటీవల కాలంలో పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. ఈ హెచ్చరికలతో ఇరాన్‌ను ఒప్పందానికి తీసుకురావొచ్చని ఆయన విశ్వసిస్తున్నారు. అయితే, సుదీర్ఘకాలంగా వైమానిక దాడులు చేపడుతుండటంతో అగ్రరాజ్య ఆయుధ నిల్వలు భారీగా తగ్గిపోతు న్నాయి. ఇప్పటికే 80 శాతం మిసైల్ డిఫెన్స్ సిస్టమ్ ఇంటర్‌సెప్టర్లు, దాదాపు సగం పేట్రియాట్ క్షిపణులు కరిగిపోయినట్లు ఇటీవల కథనాలు వచ్చాయి. అయితే, వీటిని ట్రంప్ కొట్టిపారేశారు. తమ వద్ద పెద్ద ఎత్తున ఆయుధ నిల్వలు ఉన్నట్లు పేర్కొన్నారు. అంతేగాక, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా.. భారీ సంఖ్యలో ఎ÷-లాంట్లు, ఫ్యాక్టరీలను రక్షణ రంగ కంపెనీలు నిర్మిస్తున్నాయని తన ట్రూత్ ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే, క్షిపణుల సంఖ్య గురించి మాత్రం ఆయన కచ్చితమైన లెక్క చెప్పకపోవడం గమనార్హం.

# మళ్లీ బంగారం ధరల పరుగు



హైదరాబాద్,ఆగస్ట్9 : గత కొద్దిరోజుల నుంచి బంగారం ధరలు మళ్లీ వరుసగా పెరుగుతూ పోతున్నాయి. కూడా బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 1090 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 1000 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 820 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,52,350 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,39,650 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,14,260 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

# సిఎన్‌జికి ప్రత్యామ్నాయంగా బయోగ్యాస్

- దేశీయంగా ఉత్పత్తి పెంచాలన్న లక్ష్యంలో కేంద్రం
- ఇంధన అవసరాలు తీర్చుకునేలా ప్రణాళికలు

న్యూఢిల్లీ,ఆగస్ట్8 : దేశంలో పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని ప్రోత్సహించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో సీఎన్‌జీలో కూడా బయోగ్యాస్‌ను మిళితం చేసి వినియోగదారులకు అందించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం కేంద్ర మంత్రివర్గం రూ.23,731 కోట్ల వ్యయంతో గోబర్ధన్ పథకానికి ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా దేశీయంగా కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తిని పెంచడంతో పాటు, దిగుమతి చేసుకునే సహజ వాయువుపై ఆధారపడటాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం. గోబర్ధన్ అంటే సేంద్రియ గ్యాస్. ఈ పథకాన్ని 2027 నుంచి 2036 ఆర్థిక సంవత్సరాల మధ్య అమలు చేయనున్నారు. దేశవ్యాప్తంగా సేంద్రీయ వ్యర్థాలను వినియోగించి బయోగ్యాస్ ఉత్పత్తిని భారీగా పెంచడం, ఆ గ్యాస్‌ను సీఎన్‌జీ నెట్‌వర్క్‌లో వినియోగించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. కంప్రెస్డ్ బయోగ్యాస్ ను పశువుల పేడ, పంట అవశేషాలు, పురపాలక వ్యర్థాలు, ఆహార వ్యర్థాలు, చెరకు కర్మాగారాల వ్యర్థాలు వంటి సేంద్రీయ పదార్థాల నుంచి ఉత్పత్తి చేస్తారు. శుద్ధి పక్రియ అనంతరం ఈ గ్యాస్ రసాయనికంగా సహజ వాయువుకు చాలా దగ్గరగా ఉంటుంది. అందువల్ల ఇప్పటికే ఉన్న సీఎన్‌జీ, పీఎన్‌జీ పంపిణీ వ్యవస్థల ద్వారానే దీన్ని సరఫరా చేయవచ్చు. ప్రభుత్వం ప్రకటించిన ఈ నిర్ణయంతో ప్రస్తుతం ఉపయోగిస్తున్న సిఎన్‌జి కార్ల యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బయో-గ్యాస్ రసాయనిక లక్షణాలు సహజ వాయువుకు సమానంగా ఉండటంతో వాహనాల్లో ఎలాంటి ఇంజిన్ మార్పులు లేదా హార్డ్‌వేర్ అప్‌గ్రేడ్ అవసరం ఉండదు. పెట్రోల్‌లో ఇ20 వినియోగానికి ప్రత్యేక ఇంజిన్ అవసరమైనట్లు గా, బయో-అఔఉ విషయంలో అలాంటి



నిబంధనలు ఉండవు. ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం నగర గ్యాస్ పంపిణీ సంస్థలకు బయోగ్యాస్ మిశ్రమం తప్పనిసరి కానుంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో 3 శాతం బయోగ్యాస్ మిశ్రమంతో ప్రారంభించి, 2027-28లో 4 శాతానికి, 2028-29 నుంచి 5 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. పథకం అమలుతో దేశీయంగా బయో-గ్యాస్ ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. రాబోయే దశాబ్దంలో బయోగ్యాస్ ఉత్పత్తి దాదాపు 10 రెట్లు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తు న్నారు. దీంతో విదేశాల నుంచి సహజ వాయువు దిగుమతులపై ఆధారపడటం తగ్గి, దేశ విదేశీ మారక వ్యయాన్ని కూడా తగ్గిం చవ చ్చని నిపుణులు చెబుతున్నారు. కేంద్రీయ వ్యర్థా లను వినియోగించి ఇంధనం ఉత్పత్తి చేయడం వల్ల వ్యర్థాల నిర్వహణ మెరుగుపడటమే కాకుండా, పర్యావరణ కాలుష్యం కూడా తగ్గే అవకాశం ఉంది. అదే సమయంలో రైతులకు పంట అవశేషాలు, పశువుల పేడ వంటి వన రుల ద్వారా అదనపు ఆదాయం లభించే అవ కాశాలు కూడా ఈ పథకం ద్వారా ఏర్పడనున్నాయి. దేశంలో స్వచ్ఛ మైన ఇంధన వినియోగాన్ని పెంచే దిశగా గోబర్ధన్ పథకం కీలక అడుగుగా భావిస్తున్నారు.